# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి

## శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా స్పెషల్



శ్రీశ్రీకి జాతీయ ఎవార్డు తెచ్చి పెట్టినపాట ‘అల్లూరి సీతారామరాజు‘ చిత్రంలోని ‘తెలుగువీర లేవరా..‘. ఆ పాటలో రెండు వాక్యాలు
‘ప్రతి మనిషీ తొడలు గొట్టి - శృంఖలాలు పగులగొట్టి
సింహాలై గర్జించాలి..‘ అని వుంటాయి. సునిశితంగా గమనిస్తే ఇందులో ఒక వ్యాకరణ దోషం ఉంది. ‘ప్రతి మనిషి‘ అనేది ఏక వచనం. కానీ ‘సింహాలై‘ అనేది బహువచనం. ఒకే పోలికలో భిన్నమైన వచనాలు వాడడం వ్యాకరణరీత్యా పొరబాటు. ఐతే చాలా రోజుల వరకూ శ్రీశ్రీ కూడా ఈ పొరబాటుని గమనించనే లేదు. తెల్సుకున్న తర్వాత అది పొరబాటేనని ఒప్పుకున్నారు. స్వరానికి లోపం రాకుండా ‘సింహంలా గర్జించాలి..‘ అని వ్రాసి ఉండాల్సింది. పొరబాటుని సమర్ధించుకోవడం కాకుండా, ఒప్పుకోవడం శ్రీశ్రీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

***



‘పంతాలు - పట్టింపులు‘ సినిమాలో శ్రీశ్రీ రాసిన పాట ‘ఇనుకోరా..ఈ మల్లన్న మాటే ఇనుకోరా..‘. అందులో ఒకచోట ‘ఈ బతుకుందే ఎంతో బరువు..‘ అని రాశారు. పక్కనే ఉన్న నటుడు చదలవాడ కుటుంబరావు గారు ’ ఈ బతుకుందె మా సెడ్డ బరువు..‘ అని మార్చమని చెప్పారు. శ్రీశ్రీ వెంటనే ఒప్పుకుని ‘సెడ్డ బరువు‘ అని మార్చారు. యాదృచ్ఛికం ఏమిటంటే అదే రాత్రి చదలవాడ గారు తన బరువైన బతుకుని ముగించారు..!

***

శ్రీశ్రీ అంటే విప్లవ గీతాల స్పెషలిస్ట్ అని అపప్రధ వుంది. అయితే భావగీతాలుగా పరిగణించదగిన అనేక పాటల్ని కూడా శ్రీశ్రీ రాసారు. ‘ఆకాశ వీధిలో అందాల జాబిలి‘, ‘నా హృదయంలో నిదురించే చెలి‘, ‘పాడవేల రాధికా..‘,‘ ఎవరివో..నీవెవరివో..‘ ఇలాంటివన్నీ శ్రీశ్రీ వ్రాసిన లలిత లలిత గీతాలే..! ఒకసారి ఎస్.రాజేశ్వరరావు గారు ‘బొబ్బిలి యుద్ధం‘ సినిమా పాటల సిటింగ్‌లో శ్రీశ్రీ గారితో కూర్చున్నారట. ఆయన్ని రెచ్చగొట్టాలన్న ఉద్దేశంతో ‘ఇందులో ఒక జావళి ఉంది..మీరు



వ్రాయగలరా..?' అని అన్నారట. 'గలనో లేదో చూడండి..' అంటూ 'నినుజేర మనసాయెరా - నా స్వామి చనువార దయసేయరా..' అని ముందుగా ఇచ్చిన ట్యూన్‌కి అలవోకగా రాసేసారట ..దటీజ్ శ్రీశ్రీ.

***

శ్రీశ్రీ గురించి కొన్ని సినిమాపాటల్లో ఇతర కవులు ప్రస్తావించడం ఆయన పాటల పట్ల, కవిత్వం పట్లా వారికున్న ఆప్యాయతని సూచిస్తుంది.

రాజ్ - కోటి సంయుక్తంగా సంగీత దర్శకత్వం వహించిన 100వ సినిమా రాజ విక్రమార్క(1990) ఇందులో వేటూరి ఒక పాట వ్రాసారు 'గగన కిరణ గమనమిది - భువన భవన చలనమిది - చలిత లలిత కథనమిదే - శ్రీ రాగం ఆడే శృంగార క్షణంలో - శ్రీశ్రీలో రేగే కవితాగ్ని కణంలో..' అంటూ శ్రీశ్రీని ప్రస్తావించారు.

అలానే రామదండు (1981) సినిమాలో ఆత్రేయ 'చిన్నాడు అబ్బలాగే కవిగాడవుతాడు - శ్రీశ్రీలా కవిత రాస్తాడు..' అని రాశారొక పాటలో.

***



కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఒకే ఒక చిత్రానికి శ్రీశ్రీ ఒక పాట రాసారు. అది విశ్వనాథ్ గారి మొట్ట మొదటి సినిమా 'ఆత్మగౌరవం'. అందులో శ్రీశ్రీ రాసిన పాట' వలపులు విరిసిన పూవులే - కురిపించెను తేనియలే..'

***

శ్రీశ్రీ వ్రాసిన అత్యంత ప్రసిద్ధమైన గేయం 'మరో ప్రపంచం..మరో ప్రపంచం..మరో ప్రపంచం ..పిలిచింది..'. దీని నడకని 'భజగోవిందం..భజగోవిందం..గోవిందం భజ మూఢమతే..' నుండి తీసుకున్నానని శ్రీశ్రీ రాసారొకచోట.

***

## అనువాద - అనుకరణ స్వరాలు

ఒక భాషలోని ట్యూన్స్‌ని మరో భాషలో అనుకరించడం, అరువు తెచ్చుకోవడం ఎప్పటినుంచీ వస్తున్న ఆచారమే. పాత సినిమాల్లో ఇలా అనుకరించబడిన చాలా స్వరాలకి తమిళ మాతృకలు ఎక్కువగా వుండేవి. దీనికి ఒక కారణం ఆయా తెలుగు సినిమాలని తమిళ సినిమాల ఆధారంగా నిర్మించడం కూడా.

కొన్ని ఉదాహరణలివిగో..

| తెలుగు చిత్రం | పాట | తమిళ చిత్రం | ఒరిజినల్ పాట |
|---|---|---|---|
| శభాష్ సూరి | దేవుడికేం హాయిగా వున్నాడు | పెరియ ఇడత్తు పెణ్ | అవళ్‌కెన్నా |
| గుడిగంటలు | దూరానా నీలి మేఘాలు | ఆలయమణి | మానాట్టుం |
| గుడిగంటలు | జన్మమెత్తితిరా | ఆలయమణి | సట్టిసుట్టలు దడా |
| నాదీ ఆడజన్మే | నా మాట నమ్మితివేలా | నానుం ఒరుపెణ్ | ఏమార సొన్నతు |
| నాదీ ఆడజన్మే | కన్నయ్యా నల్లని కన్నయ్యా | నానుం ఒరుపెణ్ | కణ్ణా కరుణనిరకణ్ణా |
| నాదీ ఆడజన్మే | చిన్నారి పొన్నారి పువ్వు | నానుం ఒరుపెణ్ | పూం పోల పూం పోల |
| లేతమనసులు | అందాల ఓ చిలుకా | కొళందై దైవం | అన్బుళ్ళ మాంగళియే |
| లేతమనసులు | కోడి ఒక కోనలో | కొళందై దైవం | కోళి ఒరు కూచ్చిలే |
| లేతమనసులు | పిల్లలూ దేవుడు | కొళందై దైవం | కొళందై దైవం |
| లేతమనసులు | హల్లో మేడం సత్య భామ | కొళందై దైవం | ఎన్నవేగం నిల్లు బామా |

## *సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు*



లేదమ్మ కలిమిలో జీవితం
వృధాడంబములతో రాదులే
జగానా గౌరవం
నీతి తప్పని నియమం
పొరబాటు ఒప్పుకునే ధైర్యం
పెంచుకోవలె సహనం
కాగలం అమరులం

**ఒకే తల్లి పిల్లలు (1953)**

చేయగలిగినది చేశావంతా
చెయ్యిదాటితే ఎందుకు చింత?
కృతఘ్నులుండే కాలంలో
ఎవరికెవరు ఈ లోకంలో..

**కన్నతల్లి (1953)**

లేని పోని పరువు

తల మోయరాని బరువు

ప్రతిరోజూ మనకు కరువూ

**గుమాస్తా** (1953)



నేడు పూచిన గులాబీ పువ్వు

రేపటికంతా మన్నయిపోవు

కాలానికి కళ్ళెం వేయలేవు

ఆనందానికి అంతం కనలేవు

**గుమాస్తా** (1953)

వచ్చిన వాళ్ళు పోతారు

పోయినవాళ్ళు రాబోరు

ఈ రాకపోకల సందున ఉంది

రంజైన ఒక నాటకము

**అర్థాంగి** (1955)



మనసుంటె మన్నించాలి

మనిషంటే మనసుండాలి

ఉందనుకుంటే ఉండిపో

సుఖముందనుకుంటే మరిచిపో

బంధాలే తెంపిపో

**అంతే కావాలి** (1955)

కొలనులోని కలువరాణి - గగనానికి ఎగరాలని

చందమామ జతలోన - చలాకీగా తిరగాలని

వయసు సొగసు నివాళిగా - మనసు మనసు కలపాలని

కోరుకునే కోరికలు కూరిమికే సూచనలు

**దొంగలున్నారు జాగ్రత్త** (1958) ***